క్లుప్తంగా

ఈవీఎం గోదాముల వద్ద పటిష్ట భద్రత


బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

నెల్లిమర్ల రూరల్: ఈవీఎం గోదాముల వద్ద చిన్న పొరపాటు కూడా జరగకుండా భద్రతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ నాగలక్ష్మి సెల్వమణి అధికారులకు సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని ఈవీఎం గోదాములను మంగళవారం జేసీ మయూర్ అశోక్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఈవీఎం గోదాముల వద్ద పూర్తి స్థాయి భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. గోదాం కింది భాగంలో మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ లైట్లు పాడైన చోట కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. గోదాము వద్ద సెక్యూరిటీ సిబ్బంది అవసరమైతే చర్యలు తీసుకోవాలని డీఆర్వోకు ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ దేవీ ప్రసాద్, తహసీల్దార్ రమణరాజు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పత్రం అందజేత


అమకాం సచివాలయంలో రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ


డెంకాడ: మండలంలోని అమకాం పంచాయతీలో రిజిస్ట్రేషన్ చేసిన భూమి పత్రాలను యజమాని బలసా అప్పారావుకు మోపాదలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. అమకాం పంచాయతీ పరిధిలో ఉన్న బెల్లాం రెవెన్యూ గ్రామంలో జగనన్న భూసర్వే పూర్తయ్యింది. దీంతో అమకాం గ్రామంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న డాక్యుమెంట్‌ను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, మండల ప్రత్యేకాధికారి జమదగ్ని, తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఎంపీడీవో డీడీ స్వరూపారాణి, జేసీఎస్ కన్వీనర్ సారిక గౌరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు

డెంకాడ: జిల్లా నెహ్రూ యువ కేంద్రం యువ ఉత్సవ్ 2023ని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల్లో చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి ప్రతిభను కనబరిచారు. రాష్ట్ర స్థాయి అర్హత నిమిత్తం డిక్లమేషన్, యంగ్ ఆర్టిస్ట్, యంగ్ రైటర్, ఫొటోగ్రఫీ తదితర విభాగాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. దీనిలో యంగ్ రైటర్ విభాగంలో ఎల్లపు కావ్య, ఫొటోగ్రఫీ విభాగంలో బి.శివ ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ పి.సీతారామరాజు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, స్టూడెంట్ డీన్ ఎస్.మోహన్‌కుమార్, ఐక్యూఏసీ కన్వీనర్ వి.నగేష్, ఎన్ఎస్ఎస్ పీవో ఎన్.షణ్ముఖరావు అభినందించారు.

బియ్యం పంపిణీ


పేదలకు బియ్యం పంపిణీ

విజయనగరం: ఆకలితో ఏ కుటుంబం అలమటించ రాదని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెత్సా సత్యనారాయణ మూర్తి అన్నారు. సంఘం కార్యాలయంలో 108 మంది పేదలకు బియ్యం మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ వస్త్ర వ్యాపారులు మాటూరు మురళీకృష్ణ, నూకరత్నం పాల్గొని బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘానికి రూ.10 వేలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, కోశాధికారి విజ్జపు వెంకట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం, ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు మంగళవారం భక్తులకు పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. స్థానిక మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడిలో కొలువైన పైడితల్లి అమ్మవారికి లడ్డూలతో నివేదన చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్ శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో పైడితల్లి అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరణ చేశారు.

పాలనలో కొత్త శకం


లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కొత్త శకం ప్రారంభమైందని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 5, 6, 7, 8, 9 సచివాలయాల పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయయాదవ్, కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్‌చార్జులు ఎస్.బంగారునాయుడు, ముచ్చు శ్రీను, బోడసింగి ఈశ్వరరావు, కార్పొరేటర్లు అల్లి సత్యకుమారి, పి.మాలతి, జి.మురళి, మారోజు శ్రీను, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. రూరల్ మండలం కొండకరకాం గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల పాల్గొన్నారు. – విజయనగరం/రూరల్

ప్రజా సంక్షేమం ప్రభుత్వ అభిమతం


లబ్ధిదారునికి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ అభిమతమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. సీహెచ్ అగ్రహారంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. 291 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ప్రత్రాలను అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కళ్యాణి, వైస్ ఎంపీపీ ఎన్.సత్యనారాయణరాజు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, సర్పంచ్ కొత్తకోట శ్రీరాములు, ఎంపీడీవో జి.రామారావు, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, డీటీ లావణ్య పాల్గొన్నారు. – పూసపాటిరేగ

గడప వద్దకే పాలన


మోపాదలో ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ

ప్రభుత్వ పాలన గడప గడపకు చేరుతుందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మోపాద గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. 11 రకాల సేవలకు సంబంధించిన 1246 ధ్రువీకరణ పత్రాలను అధికారులు మంజూరు చేశారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పలువురికి పత్రాలను అందజేశారు. మండల ప్రత్యేకాధికారి జమదగ్ని, తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఎంపీడీవో డీడీ స్వరూపారాణి, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జడ్పీటీసీ సభ్యురాలు బడుకొండ లక్ష్మి, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్‌లు బడ్డుకొండ కవిత, తోరోతు త్రిమూర్తులు, సరగడ కల్యాణి, డెంకాడ, పోలిపల్లి సొసైటీ అధ్యక్షులు రొంగలి కనకసింహాచలం ,బాలి సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. భోగాపురం మండల కేంద్రంలో గ్రామ సచివాలయ 1లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ ప్రారంభించారు. – డెంకాడ/భోగాపురం

గ్రామాల్లో 'సురక్ష' క్యాంపులు


బొప్పడాం గ్రామంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ తదితరులు – నెల్లిమర్ల రూరల్

'సురక్ష'తో సత్వర సేవలు

జగనన్న సురక్షతో ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజని అన్నారు. జరజాపుపేట సచివాలయం 1 పరిధిలో వైస్ చైర్మన్ సముద్రపు రామారావు అధ్యక్షతన మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. నగర పంచాయతీ పార్టీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకటకృష్ణారావు, కమిషనర్ బాలాజీ ప్రసాద్, జేసీఎస్ పట్టణ కన్వీనర్ మజ్జి గణేష్, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు పాల్గొన్నారు. అనంతరం 554 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. – నెల్లిమర్ల రూరల్


లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న చైర్‌పర్సన్ బంగారు సరోజని

ధ్రువపత్రాలను పరిశీలించిన జేసీ

నగర పంచాయతీలోని జరజాపుపేట సచివాలయం 1 పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జేసీ మయూరఅశోక్ సందర్శించారు. వచ్చిన వినతులు, ఎన్ని టోకెన్లు జారీ చేసింది.. కమిషనర్ బాలాజీప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. 588 టోకెన్లు జారీ చేయగా, 255 ధ్రువ పత్రాలు లబ్ధిదారులకు అందజేసినట్టు కమిషనర్ తెలిపారు. – నెల్లిమర్ల రూరల్


ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న జేసీ మయూర అశోక్

పదవులకే వన్నె తెచ్చిన రోశయ్య

• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


కేక్ కట్ చేసి తినిపిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ఆర్యవైశ్యుల ముద్దుబిడ్డ, మేధావి, కార్యదక్షత గల గొప్ప నాయకుడు కొణిజేటి రోశయ్య అని ఏపీ శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు పూర్వ గవర్నర్ దివంగత కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను జిల్లా, పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కోలగట్ల తొలుత వాసవీమాతకు పూజలు చేశారు. రోశయ్య చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు వంటి వారి తర్వాత ఆర్యవైశ్యుల్లో ఒక ఆణిముత్యం రోశయ్యని అన్నారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో మచ్చ లేని నాయకుడిగా వెలుగొందారన్నారు. ఆయనతో కలసి పని చేసే అదృష్టం తనకు దక్కిందన్నారు. దివంగత నేత వైఎస్సార్ మరణం తర్వాత ఉమ్మడి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లగలిగే సమర్థ నేతగా అప్పటి కాంగ్రెస్ అధిష్టానం భావించి, రోశయ్యను ముఖ్యమంత్రిని చేసిందని గుర్తు చేశారు. రోశయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్యవైశ్యులకు అన్ని రంగాల్లోనూ సముచిత స్థానం కల్పిస్తున్నారని.. వారి మనోభావాలను దృష్టిలో పెట్టుకునే చింతామణి నాటక ప్రదర్శనను రద్దు చేయించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు వెత్సా సత్యనారాయణమూర్తి, కార్యదర్శి విజ్జపు వెంకట శ్రీనివాసరావు, తవ్వా మోహనరావు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు కందుల సంతోష్, అమరజీవి ఫౌండేషన్ అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

• ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ


మోపాదలో ఆర్‌బీకేని ప్రారంభిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ

డెంకాడ: రైతుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని మోపాడ గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మంగళవారం ప్రారంభించారు. గతంలో రైతులు విత్తనాలు, ఎరువుల కోసం మండల, జిల్లా కేంద్రాల చుట్టూ ప్రదక్షణలు చేసేవారని తెలిపారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు సేవలు అందిస్తుందన్నారని చెప్పారు. విత్తనాలు, ఎరువులు వంటివి గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందిస్తున్నారన్నారు. రైతు పంట సాగుకు పెట్టుబడి సాయం కూడా ప్రభుత్వం అందిస్తున్నారని వివరించారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతో సీఎం జగన్ పని చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జడ్పీటీసీ సభ్యురాలు బడుకొండ లక్ష్మి, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్‌లు బడ్డుకొండ కవిత, సరగడ కల్యాణి, తోరోతు త్రిమూర్తులు, ఏవో పూడి నిర్మల, ఎంపీడీవో స్వరూపారాణి, తహసీల్దార్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి జయంతి

• భారీ బైక్ ర్యాలీ


నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న తెలగ సామాజిక వర్గ యువత

విజయనగరం: కాపుల ముద్దుబిడ్డ, కాపు జాతి మేలిమి బంగారం వంగవీటి మోహనరంగా ఆశయాలను ముందుకు తీసుకు వెళ్తామని విజయనగరం జిల్లా తెలగ కుల యువజన సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. వంగవీటి మోహనరంగా జయంత్యుత్సవం సందర్భంగా మంగళవారం నగరంలో తెలగ యువత ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా విజయనగరం కోట జంక్షన్ వద్ద ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వంగవీటి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జోహార్ వంగవీటి మోహనరంగా, జై తెలగజాతి నినాదాలతో హోరెత్తించారు. రాజకీయాలకు అతీతంగా జరిగిన ఈ భారీ బైక్ ర్యాలీలో సుమారు ఐదు వందల మంది యువత పాల్గొని నగరంలోని కోట, మూడు లాంతర్లు, గంటస్తంభం, కన్యకాపరమేశ్వరి ఆలయ కూడలి, ఎన్సీఎస్, రైల్వేస్టేషన్, మయూరి కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్, సింహాచలం మేడ మీదుగా మళ్లీ కోట కూడలికి చేరుకుంది. వంగవీటి జయంతిని పురస్కరించుకొని కోట కూడలి వద్ద తెలగ యువత ఆధ్వర్యంలో భారీగా అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పిడుగు సతీష్, పుంద్రోతు రవీంద్రకుమార్, యార్లగుల చక్రవర్తి, మొదిలి శ్రీనివాస్, కుందేటి రామకృష్ణ, ఎం.గాయత్రి, వై. మాధవి తదితరుల ఆధ్వర్యంలో నగరంతో పాటు జిల్లా నలుమూలల నుండి భారీ సంఖ్యలో తెలగ యువత హాజరై బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పనులు

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులను విద్యుత్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేసి విద్యుత్ సరఫరాను మంగళవారం పునరుద్ధరించారు. విద్యుత్‌శాఖ డీఈ సత్యపరిపూర్ణ కుమార్, విద్యుత్ శాఖ ఏఈ నాగేశ్వరరావు పర్యవేక్షణలో కుమిలిలో మరమ్మతులకు గురైన రెండు 16 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చారు. గత మూడు రోజులుగా కుమిలి గ్రామానికి చెందిన ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామానికి చెందిన పలువురు మహిళలు కుమిలి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు గంటలు వ్యవధిలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కుమిలి ఉపసర్పంచ్ గుజ్జు సురేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గాబు సూరప్పన్నరెడ్డి తదితరులు వున్నారు.

వరి విత్తనాల పంపిణీ


విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: ప్రభుత్వం రాయితీపై మంజూరు చేసిన వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని సీహెచ్ అగ్రహారం రైతు భరోసా కేంద్రంలో రైతులకు వరి విత్తనాలు పంపిణీని ఆయన మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజనుకు సంబంధించి నియోజకవర్గంలో అన్ని రైతు భరోసా కేంద్రాలకు రైతులకు రాయితీపై అందించేందుకు వరి విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ఎంపీడీఓ జి.రామారావు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఎస్.సత్యనారాయణరాజు, మహంతి జనార్ధనరావు, కొత్తకోట శ్రీరాములు, పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీలో టిఫా స్కాన్


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అప్పలరాజు

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ ద్వారా గర్భిణులకు ఉచితంగా టిఫా స్కాన్ తీయడం జరుగుతుందని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు పేర్కొన్నారు. స్థానిక తిరుమల ఆస్పత్రి సమావేశ మందిరంలో మంగళవారం ఆరోగ్య మిత్రాలతో ఆయన సమావేశం నిర్వహించారు. గర్భిణులకు 3, 6, 9 నెలల్లో ఆరోగ్యశ్రీ ద్వారా అల్ట్రాసౌండ్ స్కాన్ గైనికాలజీ విభాగం ఉన్న ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉచితంగా చేస్తారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆస్పత్రిలో చేరిన వారికి సకాలంలో వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. ఆరోగ్యశ్రీ వార్డుల్లో చికిత్స పొందుతున్న వార్డుల్లో ప్రతి రోజు పర్యటించి వారికి అందుతున్న వైద్య సేవలు గురించి తెలుసుకోవాలన్నారు. ఏ ఆస్పత్రిలో సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తే వెంటనే తెలియజేయాలని సూచించారు. ఆరోగ్యశ్రీ మేనేజర్ రాంబాబు, టీమ్ లీడర్లు తుంపల్లి జనార్ధన్, భాను, ఆర్.ముత్యాలనాయుడు, ఉమ, దేవి పాల్గొన్నారు.

అలుపెరగని పోరాటయోధుడు 'అల్లూరి'


డెంకాడ: మన్యంవీరుడు అల్లూరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కమాండెంట్ రాహుల్‌దేవ్‌శర్మ తదితరులు


విజయనగరం అర్బన్: అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ ప్రొఫెసర్ కట్టిమణి


విజయనగరం క్రైం: అల్లూరి చిత్రపటానికి పూలమాలలేస్తున్న ఎస్పీ ఎం.దీపిక


విజయనగరం ఫోర్ట్: అల్లూరి చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎస్ఈ ఉమాశంకర్


నెల్లిమర్ల రూరల్: సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వామపక్ష నేతలు

డెంకాడ: స్వాతంత్ర్య పోరాటంలో అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని ఏపీఎస్పీ ఐదో బెటాలియన్ కమాండెంట్ రాహుల్‌దేవ్ శర్మ అన్నారు. అల్లూరు జయంతి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చింతలవలస ఏపీఎస్పీ బెటాలియన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయనతో పాటు ఇతర అధికారులు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భారత స్వాతంత్ర్యం కోసం అలుపెరుగని పోరాటం చేసిన అల్లూరి సీతారామరాజు చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో అడిషినల్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్‌లు బీఆర్ శ్రీనివాసులు, డి.వెంకటేశ్వరరావు, వి.నారాయణరావు, అధికారులు, మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

విప్లవ కెరటం అల్లూరి : ఎస్ఈ

విజయనగరం ఫోర్ట్: అడవి నుంచి ఆకాశానికి ఎగిసిన విప్లవ కెరటం అల్లూరి సీతారామరాజు అని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ బి.ఉమాశంకర్ అన్నారు. స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో మంగళవారం అల్లూరి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అల్లూరి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణ ప్రభాత్, ఈఈ రాజన్, డీఈలు గోవిందరావు, సునీత, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిగా పోరాటం

నెల్లిమర్ల రూరల్: మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని వామపక్ష నేతలు పిలుపునిచ్చారు. పట్టణంలోని స్థానిక బాలికోన్నత పాఠశాలలో సీపీఎం, సీపీఐ, న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ముందుగా అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గిరిజన విశ్వవిద్యాలయంలో...

విజయనగరం అర్బన్: గిరిజన జాతి ప్రజలను ఒక్కతాటిపై నిలిపి, వారిని విప్లవ వీరులుగా తీర్చిదిద్ది, బ్రిటిష్ ప్రభుత్వంపై యుద్ధం చేసిన అల్లూరి సీతారామరాజు భారత విప్లవ చరిత్రలో మహనీయుడని గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి అన్నారు. అల్లూరి జయంతి ఉత్సవాలు మంగళవారం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వవిద్యాలయంలోని ట్రైబల్ స్టడీస్ డిపార్ట్‌మెంట్ నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విప్లవ జ్యోతి అల్లూరి

విజయనగరం క్రైమ్: విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఎం.దీపిక అల్లూరి చిత్రపటానికి పూలమాలలేసి ఘన నివాళులర్పించారు. ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, డీపీఓ ఏఓ వెంకటరమణ, లీగల్ అడ్వయిజర్ వై.పరశురాం, ఎస్ఐ వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.